ఓంశ్రీసాయిరాం

నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడుదాక పొట్టకై
హద్దును పద్దు లేక వ్యయమందగ జేయుచు జీవితంబు నీ
విద్దెల ధారపోసి అరవింద దళాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచనచేయు మానవా!

ఇది భౌతిక జీవితమునకు ప్రధాన లక్ష్యముగా భావిస్తున్నారు ప్రజలు. కానీ, ఆధ్యాత్మిక రంగమునందు ప్రవేశించిన యిది పరమ విరుద్ధంగా కనిపిస్తుంది. కృష్ణుడు ప్రతి మానవుని మానవుడుగా భావించలేదు. 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః' మీరు నా అంశము, ప్రత్యేకము కాదు. నా అంశమే మీరు. మీరు మానవులుగా బ్రతకవలసిన ప్రవర్తన మీలో లేదు. లేక పశువులుగా ప్రవర్తించ వలసిన అవసరము మీది కాదు. నా అంశమునందు పుట్టిన మీరు అనుభవించవలసినది, కోరవలసినది వేరు. నా అంశములు సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింసలు. ఈ గుణములతో ప్రవర్తించవలసిన మానవులు కామక్రోధమదమాత్సర్యములతో మెలగుతున్నారు. ఇది మానవత్వమునకే అవమానము.

ఆహారవిహారములచేతనే మానవుని గుణములు మార్పు చెందుతున్నవి. కనుక, మనము తినే తిండి వేళవేళకు, సమమైన ఆహారము తీసుకొని సరైన మార్గములో మానవునివలె బ్రతకాలి. కానీ, ఈనాటి మానవుడు విద్యను అభ్యసించటం అవసరమే. చదివినంత మాత్రమున చదువు చదువు కాదు. విద్య అనేది బాహ్యమైన, లౌకికమైన, ప్రకృతికి సంబంధించినది. ఇది విద్య అనిపించుకోదు. ఇది బాహ్యమైన, లౌకికమైన అర్థములచేత ప్రవర్తిస్తూ వస్తున్నది. 'చదివితినంచు గర్వమేల? ఈ చదువులలోనున్న మర్మమేమి అని ప్రశ్నించండి. ప్రతి మానవుడు లౌకికమైన విద్య తెలుసుకోవలసిందే. మీరు భౌతికింగా, ఆధ్యాత్మికంగా రెండింటిలో చేరినవారే. ఈ లౌకిక విద్యలు కొంతవరకు జీవితానికి ఆదర్శముగా వుంటాయి. కానీ, ఆధ్యాత్మిక విద్య చాలా అవసరము. అవే సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస. అందరూ ప్రేమిస్తున్నారు. కానీ, అది నిజమైన ప్రేమ కాదు. కేవలం దేహసంబంధమైన, ప్రాకృతమైన మెప్పు నిమిత్తమై ప్రేమ వున్నట్లు నటిస్తున్నాము. అన్నింటికి సత్యము ప్రధానము. ఈ సత్యమునుండియే ధర్మము ఆవిర్భవించింది. సత్యాన్నాస్తి పరోధర్మః. సత్యధర్మములు రెండూ చేరినప్పుడు శాంతి సహజంగా ప్రాప్తిస్తుంది. ఎప్పుడు శాంతి లభించెనో అప్పుడు మనలో ప్రేమ వుట్టిపడుతుంది. ప్రేమ వచ్చినప్పుడు హింస సమీపమునందే వుండదు. ఎవ్వరినీ హింసేచేది కాదు. కనుక, అంతర్భావములైన, అంతర్ ప్రవాహములైన ఈ సత్యధర్మశాంతిప్రేమల తత్త్వాన్ని గుర్తించటానికి మొట్టమొదట ప్రయత్నించాలి.

సత్యము అంటే కేవలము చూచినది చూచినట్లు, చెప్పింది చెప్పినట్లు, విన్నది విన్నట్లు చెప్పటము కాదు. అది అంతర్భావమునుండి ఆవిర్భవించేది. దేనికి లక్ష్యము చేయదు. సత్యాన్ని సాధించినవారు లోకములో ఎక్కువగా కనిపించరు. సత్యము అందరికీ కనిపించే పదార్థము కాదు. హృదయమునుండి శ్వాస ఏవిధముగా వస్తున్నాదో అదేవిధముగా సత్యము మన హదయమునుండి ఆవిర్భవించాలి. అప్పుడే మనకు సత్యము పలికినామనే తృప్తి కలుగుతుంది. అది కూర్పు చెందునది కాదు. అది నిత్యమైనది. మధ్యమధ్య మార్పు చెందేది కాదు. కనుకనే, గీతలో మొట్టమొదట సత్యమే ప్రధానము అని చెప్పారు. అదే ఆధారమైనది. ఆ సత్యాన్ని మనం ఆధారంగా తీసుకున్నప్పుడే దానినుండి ధర్మము యేర్పడుతుంది. మానవుడు చేయవలసిన కర్తవ్యము ఏమిటి, మానవుని ప్రవర్తన ఎలా వుండాలి అనేది ఆ సత్యమే మనకు ప్రబోధిస్తుంది. సత్యముయొక్క ప్రతిబింబమే ధర్మము. ఈ ధర్మము సత్యముతో చేరినప్పుడు శాంతి యేర్పడుతుంది. సత్యము వేరు, ధర్మము వేరు అయినప్పుడే మనలో శాంతి వుండదు. సత్యముతో ధర్మము చేరినప్పుడే నిజమైన శాంతి. శాంతిని ఎక్కడనుండో సంపాయించాలనే భ్రాంతి కేవలము పిచ్చి భ్రాంతియే. శాంతి అనేది వేరుగా లేదు ప్రపంచములో. సత్యధర్మములు చేరినప్పుడే శాంతి వస్తుంది. ఈ సత్యధర్మములు రెండూ వేరు వేరైనప్పుడు అక్కడ peace వుండదు. pieces అవుతుంది. ఈ శాంతి ఏర్పడినప్పుడే తనలో ఒకవిధమైన ప్రేమ ఆవిర్భవిస్తుంది. శాంతికి, ప్రేమకు సన్నిహితసంబంధబాంధవ్యముంది. మనము ప్రేమించినట్టుగా నటిస్తున్నాముగానీ అది నిజమైన ప్రేమ కాదు. శాంతితో చేరినప్పుడే ఈ ప్రేమకు నిజమైన ప్రాణము లభిస్తుంది. ఈ ప్రేమ లభించెనా ఎవరినీ హింస చేయలేవు. ప్రేమ అన్నివైపులా వుంటున్నది. అందరియందు వుంటున్నది. ప్రేమకు ప్రధాన స్థానము,

ప్రధాన రూపము, ప్రధాన క్రియలు లేవు. Love is God, live in love. ఆ ప్రేమయే నిజమైన దైవముగా భావించాలి. దీనినే ఎడ్యుకేర్ అన్నారు. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస వీటిని ఎడ్యుకేర్ అన్నారు. కామ, క్రోధ, మద, మాత్సర్యములు ఎడ్యుకేషన్‌తో చేరినవి. ఇవన్నీ ప్రాకృత లక్షణములు. కానీ, ప్రపంచమునకు ఎట్టి సంబంధము లేనిది ఎడ్యుకేర్. సత్యము అనేది ఎక్కడ చదివావు? అక్షరములతో నేర్చుకున్నది కాదు. ఆత్మ నుంచి ఆవిర్భవించినది. సత్యము మనలో ఎప్పుడు స్వరూపకంగా వుంటుంటే అదే అన్నివిధాలా శాంతిని చేకూరుస్తుంది. ధర్మము కూడా అందులోనే ఆవిర్భవిస్తుంది.

విద్యార్థులారా! సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస అనేవి చాలామంది అంతర్భావములుగా భావించుకోటం లేదు. ఇవియే ఆధారమైన పునాదులు. అవి లేకపోతే ఈ బయటి చదువులన్నీ వ్యర్థములైనవి. చదువులన్నియు చదివి, చాల వివేకియై మదిని తన్నెరుగడు మందమతుడు. సత్యధర్మశాంతిప్రేమలు లేకున్న మానవుని హృదయము హృదయమే కాదు. ఈ సత్యము మనది కాదు. భగవంతుడిచ్చిన గిఫ్ట్. అది అందరియందు వుంటున్నది. అందరికీ యిచ్చాడు. కానీ, కొందరు గుర్తించలేరు. మరికొంతమంది సత్యము ప్రాకృతమైనది, ఆధ్యాత్మికమైనది కాదని భావిస్తున్నారు. సత్యము అనేది నేర్చుకొనేది కాదు. ఒకరు చెబితే వినేది కాదు. సత్యము మొట్టమొదట హృదయమునందు ప్రతిష్ఠ చేసుకోవాలి. సత్యమును మనము అభివృద్ధి చేస్తిమా దీని ఫలితమే ప్రేమ. ఆ ప్రేమయే సత్యము యొక్క ఫలము. ప్రేమరూపములోనే అహింస అభివృద్ధి అవుతుంది. బుద్ధుడు కేవలము అహింసను సాధించాలని పోయాడు. ఎక్కడుంది అహింస? వెతికి వెతికి, 'ఛీ! ఛీ! నా దగ్గరున్నదానిని మరచి ఎక్కడనో వెతుకుతున్నాను. నేనే సత్యము. ఈసత్యమే అహింసను పోషిస్తూ వచ్చింది'. అహింస ప్రేమ వున్న వారికే ఆవిర్భవిస్తుంది. చదువుకున్నామంత మాత్రమున అన్నీ నేర్చుకున్నామని భావించరాదు.

చదువులు నేర్చితినంచు గర్వము వహించన్‌రాదు నీకున్న యా
చదువేపాటిది, విద్యకున్ వినయమే సద్రూపమౌ, నేర్వద
గ్గది యెంతో కలదంచు గర్వదురహంకారములన్ బాయుడు
హృది దానన్ తలపోయుచుండు సుగతీ! ఓయీ అవిద్యాపతీ!

చదివితినంచు గర్వమేల? దేనిని చదివావు. ప్రపంచములో ఎవరో వర్ణించిన వర్ణనలను నీవు చదివావు. దీనికి టీచరు వుంటున్నాడు. టీచరు వల్ల వచ్చేది కాదు. ఎవరు నీ టీచరు? ఆత్మయే నీ టీచరు. ఆత్మనుండియే సర్వమూ ఆవిర్భవిస్తున్నాయి.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యమందణగెను సర్వ సృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న
శుద్ధసత్త్వమిదియె చూడరండి.

అందరి మాటలు వింటున్నాము. కానీ, ఎన్ని చదువులు చదివినా ఆ ఎడ్యుకేర్ లేదు. ఎడ్యుకేర్ కలిగినవాడు ఎడ్యుకేషన్‌పైన యేమాత్రమూ అభిరుచి పడడు. మనము చదివామని గర్వముతో తిరుగుతున్నాము.

విద్యార్థులారా! అధ్యాపకులారా!

అధ్యాపకులు కూడా చక్కగా గుర్తించాలి. ఫిజిక్సు, కెమిస్ట్రీ, బోటనీ ప్రసిద్ధి గాంచినవారు. అవి సబ్జెక్ట్స్ గానీ ఆబ్జెక్ట్స్ కావు. ఎడ్యుకేర్ ఆబ్జెక్ట్స్‌తో చేరినటువంటిది. దీనికి సాటి మరొకటి లేదు. లోపలనుంచి నెట్టేటువంటిది ఆ ఎడ్యుకేర్. నీలో ఆనందము వుట్టిపడింది. ఇది ఎక్కడ నుండి వచ్చింది? పైనుండి తెచ్చి పెట్టారా! పైపునుండి తెట్టి పెట్టారా! కాదుకాదు. ఆనందము సహజంగా లభించేటువంటిది. కనుక, లౌకిక చదువుకు, ఆధ్యాత్మిక చదువుకు చాలా వ్యత్యాసము వున్నది. అయితే ఆధ్యాత్మిక చదువు అత్యవసరమనుకున్నప్పుడు ఈ లౌకిక చదువులు వదల కూడదు. ఇది నెగిటివ్, అది పోజిటివ్. జగత్తులో జీవించే వారు ప్రతి ఒక్కడు జగత్తు చదువే చదవాలి. ఇది లేకుండాపోయిన ఈ ఎడ్యుకేర్ యొక్క అంతర్భావము మనకు అర్థము కాదు. అన్నింటినీ భగవంతుడే అందిస్తున్నాడు. అయితే ఎవరిని పతివ్రత అంటారు? పతిని అనుసరించిన ఆమె పతివ్రత. పరులను అనుసరించేది కాదు. సత్యమును అనుసరించేవాడు సత్యవ్రతుడు. అతడే సత్యవంతుడు. ఒకరినుండి వచ్చినది కాదు. ఈ చిన్నచిన్న విషయములను కూడా మనము అర్థము చేసుకోటానికి ప్రయత్నించాలి. ప్రపంచములో లౌకికమును ప్రక్కకు తోసి వుంచటానికి వీలుకాదు. లౌకికము కూడా వుండాలి. గిరి వున్నాడు. 'గిరి' అని పిలిచాను. ప్రాపంచికముగా

పెట్టిన పేరు, అమ్మనాయనలు యిచ్చిన పేరు. తాను తెచ్చుకొన్నది కాదు. పుట్టినది కాదు. తల్లదండ్రులకు పుట్టినది దేహము మాత్రమే. దేహము నెగిటివ్. నెగిటివ్‌ను వుపయోగించటానికి పేరు 'పోజిటివ్' గుర్తు పెట్టారు. 'గిరి' అని పేరు పిలచినప్పుడు గిరి వస్తాడు. అంతేగానీ అందరినీ 'గిరి' అని పిలవటానికి వీలుకాదు. దేహములు వేరువేరు అయినప్పుడు అన్నిరకముల సమత్వము ఆత్మతత్త్వము ఒక్కటే. కనుక, ఎవరినైనా పేరు అడిగితే ' నేను ఫలానా'అని చెబుతారు. కాదు. నిన్ను ఎవరైనా పేరు అడిగితే, I am I. ఎందుకంటే దేహానికి 'నేను' పేరు కాదు. అదే నచికేతునకు భగవంతుడు బోధించాడు. ఎవరిని యేవిధముగా పిలచినా అందరియందు తానే వుండేది. ఈశావాస్యమిదం సర్వం. ఈశ్వరస్సర్వభూతానాం. అన్ని భూతములయందున్న ఈశ్వరతత్త్వానికి ఏ పేరు పెట్టగలరు? ప్రపంచములో గుర్తుకోసమని పేర్లు పెడుతున్నారు.

మనం నేర్చుకున్న విద్యనే మనం సరిగా వ్రాయలేము. నేర్చుకున్నవి కృత్రిమమైనవి. కొంతమంది ఇంగ్లీషు మంచి pronounciation తో మాట్లాడుతారు. correct pronounciation ఎవరు చెప్పగలరు. కొన్ని నేర్చుకున్నవారు చెప్పగలరు కానీ correct pronounciation దైవమునుండి వచ్చినటువంటిది. అదొక్కటే ఆత్మ. నీవు ఎవరంటే ఆత్మ అంటావు.

విద్యార్థులారా! భౌతిమైన విద్యలు మీరు ఎన్ని నేర్చినప్పటికిని, ఎన్ని పి.హెచ్.డి లు చేసినప్పటికిని నీ నిజ పేరు మాత్రం మరువకూడదు. అది ఆధారము చేసుకునే ఈ పి.హెచ్.డిలు అంతా వస్తున్నాయి. ఈ లోపలనున్న ఎడ్యుకేర్ ఆధారము లేక ఏదానిని పొందలేవు. ఇదే ఆధారము. దీనిని వదలి లౌకికమైన దానిని యేమాత్రమూ ఆధారము తీసుకోకూడదు. మీకు యేమైనా సందేహాలు కలిగినప్పుడు అర్థములు బోధిస్తాను. దీనికి అనేవిధములైన అర్థములుంటున్నాయి. ముఖ్యంగా ఈనాడు లౌకికమైన ఎడ్యుకోషన్ వుపయోగపెడుతున్నారుగానీ ఏలౌకికమైన ఆత్మతత్త్వమును ఎక్కడా ప్రకటించటం లేదు. inner knowledge అనేది ప్రత్యేకంగా లేదు. ఇది నాలెడ్జి కాదు. inner vision . ఈ విజన్‌లో అన్ని విషయాలూ ప్రకటితమౌతాయి. దీనికి భాష లేదు. 'రామా' అని పిలు 'ఓ' అంటాడు. 'కృష్ణా' అని పిలు 'ఓ' అంటాడు. అన్నింటికి తాను సిద్ధముగానే వుంటాడు.'పిచ్చివాడా' అని పిలచినా 'ఓ' అంటాడు. ఎందుకంటే నా నిజతత్త్వాన్ని నేను మరచిపోతున్నాను కాబట్టి. ప్రతిదానియందు సత్యము యిమిడి వున్నది. మనుష్యులు వారివారి యిష్టమునుబట్టి పేర్లు పెట్టుకుంటున్నారుగానీ సరైనది కాదు. ఈ హాలులో యింతమంది వుంటున్నారు. అందరియందు వున్నది ఒక్కటే ఒక్కటి. all are one be alike to everyone. అందరియందున్న ఆత్మతత్త్వము ఒక్కటే. దాన్ని వదలిపోవటానికి వీలుకాదు. కనుక, ఆత్మతత్త్వము బోధించటానికి తగిన అవకాశము వస్తున్నాది. దానిని పుస్కరించుకొని మీరు ఈ లౌకిక విద్యలు యేమాత్రము దూరము చేసుకోకండి. ప్రపంచము ఈ లౌకికమైన విద్యలనాశిస్తుందిగానీ, అలౌకికమైన విద్యలనాశించదు.

విద్యార్థులారా! విద్యార్థులు అనేకమంది అనేక రకములుగా మాట్లాడుతుంటారు. నా విషయమందు అనేకవిధములుగా సంభాషిస్తుంటారు. ఇవన్నీ భ్రాంతులేగానీ నిజము కాదు. మీరందరూ భగవంతులే. మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః. మీరందరూ దైవముగా భావించుకోండి. మానవులుగా భావించుకోకండి. మానవునిగా భావించుకొని మానవతా విషయాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. తిండితీర్థాదులతో మానవత్వమును వ్యర్థము చేయకూడదు. ఇది కేవలము పశుత్వము. సమయము, సందర్భము గుర్తించి వర్తించేది మానవత్వము. కానీ, ఈ రెండింటిని గుర్తించకుండా యిష్టము వచ్చినట్లు పొట్టనింపుకోటం, కేవలము పశుత్వము. కనుక, మానవత్వము, దివ్యత్వము, పశుత్వము మూడింటిని విభజించాలి. పశుత్వమును యేమాత్రమూ అనుసరించకూడదు. దీనివల్ల కాలమును ఎంతయో వ్యర్థము చేస్తున్నాము. పశువు ఎంతయో కాలము వ్యర్థము చేస్తుంది. ఆకలైనప్పుడు అన్యామునకు పోతుంది. ఆకలి కంట్రోలు చేస్తే పశుత్వము పోతుంది.

విద్యార్థులారా! సత్యాన్ని గుర్తించండి. అప్పుడు untruth కి ప్రయాణము చేయదు. మానవజన్మ చాలా దుర్లభమైనది. దైవము ఎక్కడున్నాడు? దైవం మానుషరూపేణా. అదే దృఢముగా వుండాలి. ఎన్ని రూపాలు సంపాయించినప్పటికీ అవన్నీ వేషాలు మాత్రమే. స్టేజిపై నాగయ్య త్యాగయ్య వేషము వేస్తాడు. కానీ, త్యాగయ్య నాగయ్య కాదు, నాగయ్య త్యాగయ్య కాదు. నాగయ్య నాగయ్యే, తాగయ్య త్యాగయ్యే. మనుష్యులు మనుష్యులే. తాను కేవలం దైవత్వముగా భావించుకొని మానవత్వము మరచిపోవాలి. ఆధారమైన దానిని దృష్టిలో పెట్టుకోవాలి. అదే ఆత్మ. దీన్ని పొందాలనుకుంటే సత్యధర్మప్రేములు పొందాలి. రాగద్వేషములతో కామక్రోధమదమాత్సర్యములు

వస్తాయి. సాధ్యమైనంత వరకు సాధించాలి. అప్పుడే మానవత్వము సార్థకమౌతుంది. కానీ, మృగము మాత్రము కాకూడదు.

'నిద్దురనుండి లేచి మరి నిద్దురపోయెడుదాక...' ఏమి సాధించావు? సాధించినది యేమైనా వుంటే తప్పక నేనుకూడా చేస్తాను. కనుక, దానితో సాధించేదేమీ లేదు. సాధించిన ఆధ్యాత్మికము కూడా భస్మమైపోతుంది. నీవు సెక్యులర్ నాలెడ్జి పెంచుకుంటూపోతే స్పిరిట్యుయల్ నెల్డ్జి సన్నగిల్లుతుంది. అది క్రమేణా వుండనే వుండదు. కట్టకడపటికి నాస్తికుడౌతాడు. వాడు ఆస్తికుడు కాదు, నాస్తికుడు కాదు రెండింటికి భ్రష్టుపట్టి పోతాడు. మొట్టమొదట ఆధ్యాత్మికాన్ని సాధించండి. పెద్దపెద్ద గ్రంథాలు చదివి గొప్ప పండితుడని అనిపించుకోనక్కరలేదు. పెద్ద పుస్తకములలో ఇంగ్లీషులోని 26 అక్షరములతో కూడిన పదములు తప్ప వేరే వుండవు. ఈ పదములు తప్ప వేరే పదములు రావు. మంచి అదే, చెడు అదే. మీరు మొట్టమొదట మంచి అని తెలుసుకొని మంచిని అనుసరించండి. ఈవిధంగా వుండినప్పుడే మోరల్‌క్లాస్ అవుతుంది. మోరల్‌క్లాస్ అంటే నోటికి వచ్చింది మాట్లాడి కాలము గడుపుకొని పోవటం కాదు. ఒకటి రెండైనా మంచి విషయాలు ఆచరించాలి. అదే మనలను రక్షించేది. జీవితములో ఏది అవసరమో అదే తీసుకోవాలి. తిండితీర్థాదులుకూడా అవసరమే. కానీ, అవే మనకు ప్రధానమని లక్ష్యము పెట్టుకోకూడదు.

విద్యార్థులారా! మీలోమీకు అనేకవిధములైన వాదోపవాదములు జరుగుతున్నాయి. వాదోపవాదములకు యోమాత్రమూ అవకాశమునందించరాదు. ఉన్నది నిలబెట్టుకోండి. లేనిదానికై ప్రయత్నించకండి. ముందుకు పోవాలనుకుంటే ముందుకు పోనక్కరలేదు. ఉన్న చోటునుండే సాధించవచ్చు. ఉన్నచోటే మీకు లభిస్తుంది. మహర్షులందరు ఎంతో తపస్సు చేశారు. కొండగుహలలో వుంటున్నారు. అక్కడికే భగవంతుడు వెళ్ళి దర్శనము యిస్తున్నాడు. వారు ఉన్న చోటు ఒకరు చెప్పనక్కరలేదు. దేవుడు వచ్చి రక్షించాడు అనుకుంటారు. తాను రాలేదు. నీవే అతని దగ్గరకు వెళ్ళావు. నీ దగ్గరకు భగవంతుడు రానక్కర లేదు. నీవే భగవంతుని దగ్గరకు పోతావు. కనుక, మీరు ప్రయత్నము చేయాలి, భగవంతుడు కాదు. ఈ భావాన్ని పెట్టుకొని, విద్యార్థులు చక్కగా చదివి ఇన్‌స్టిట్యూట్‌కు మంచి పేరు తేవాలి. ఇప్పుడు వచ్చింది. కానీ, ఇంతకంటె మంచి పేరు రావాలి.